

● పోలి కాంతులు



పోలిస్వర్గం దీప కాంతులతో కృష్ణానది దేదీప్యమానంగా వెలిగిపోయింది. కార్తిక మాసం ముగింపు సందర్భంగా విజయవాడ దుర్గాఘాట్‌లో బుధవారం తెల్లవారు జామున వేలాది మంది మహిళలు, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న అరటి దొప్పలలో అలంకరించిన కార్తిక వత్తులు వెలిగించి, నది ఒడ్డున పూజలు చేసిన పిదప పోలి పోయి రావమ్మా అంటూ ఆ దొప్పలను నదిలో వదిలారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని



లబ్బీపేట(విజయవాడతూర్పు): వికసిత్ భారత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె కేదారేశ్వరపేట మ్యాంగో మార్కెట్ సమీపంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ శిబిరంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు ఇచ్చారు. అనంతరం శిబిరానికి వచ్చిన రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో బాప్టిస్టుపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేఘనందిత, ఇతర ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

27న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 27న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కొలసాని శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తి అర్హతలున్న అభ్యర్థులు హాజరు కావచ్చని సూచించారు. పూర్తి వివరాలకు http://gdchvja.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చునని ఆయన తెలిపారు.

రేపు వార్డు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 15వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలోని జోనల్ కమిషనర్ చాంబర్లో ఈ నెల 15వ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు స్పెషల్ సెల్ (వార్డు సెక్రటేరియట్స్) లేదా 8185933187 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ముగిసిన కార్తిక మాసోత్సవాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న కార్తిక మాసోత్సవాలు బుధవారంతో ముగిశాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజస్వామి వారి ఆలయం వద్ద సహస్ర లింగార్చనను ఆలయ అర్చకులు నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అర్చన అనంతరం అర్ధనారీశ్వరుడిగా అలంకరించారు. పూజా కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆరోగ్యంపై అవగాహన ఉండాలి



జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్‌గౌతమ్, గ్రామ సర్పంచ్ కాకి దేవమాత అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో జూపూడిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం వారు ప్రారంభించారు. సంస్థ బూడిద చెరువు మా గ్రామంలో ఉన్నందున కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఏడాదికి రెండుసార్లు వైద్య శిబిరాలు నిర్వహించి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. శిబిరంలో మధుమేహం, బీపీ పరీక్షలతో పాటు నేత్ర, ఇఎన్‌టీ, అల్ట్రా స్కానింగ్, కాళ్ల నరాల పటుత్వ తదితర పరీక్షలు 300 మందికి నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే జగనన్న లక్ష్యం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న గౌస్‌మొహిద్దీన్, మాధురి లావణ్య



ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మనోజ్ కొఠారి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ అన్నారు. 48వ డివిజన్ 138వ సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్ మాధురి లావణ్య, ఇతర నాయకులు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం లబ్ధిదారులు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నేతలతో ముఖాముఖీ నిర్వహించారు. ప్రజల కోసం నిరంతరం పని చేస్తున్న వైఎస్సార్ సీపీకి అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు ఏ మేర సంక్షేమాన్ని అందించామనే విషయాన్ని తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు మైలవరపు కృష్ణ, ముత్తా వాసు, బోర మల్లేశ్వరరెడ్డి, దుర్బేసుల హుస్సేన్, బైపినేని కోటేశ్వరరావు, సుంకర నారాయణ, ముత్యాల రాంబాబు పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక 47వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కోఠారీ జగన్ ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన పథకాల గురించి వివరించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరారు. అందుకు ప్రజలందరూ జగన్‌కు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కొండ ప్రాంతాలతో పాటు కేఎల్‌రావునగర్‌లోని పలు సచివాలయాల పరిధిలో పర్యటించారు. కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ జోజి, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కోసమే ఇన్ఫర్మేషన్ పార్క్

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ప్లాంట్‌లో జరుగుతున్న ఆధునిక పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్‌ప్లాంట్ ప్రాంగణంలో వీఎంసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇన్ఫర్మేషన్ పార్కును బుధవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ ఎలా జరుగుతుందీ, వ్యర్థ పదార్థాల నుంచి ఉపయోగపడే వస్తువులను ఎలా తయారు చేస్తున్నారనే దానిపై ప్రజలకు, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించేలా మ్యూజియం ఇన్ఫో పార్క్‌లో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యర్థ పదార్థాల నిర్వహణ చూపించే సూక్ష్మ 3డీ మోడల్స్ పనులపై ఆరా తీశారు. ఎక్సెల్ ప్లాంట్‌లో ఫ్లవర్ వేస్ట్ మేనేజ్మెంట్, విండో కంపోస్టింగ్, వర్మీ కంపోస్ట్ ప్లాంట్, బయో మిథనేషన్ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మ్యానేజ్మెంట్ ప్లాంట్లు, మినీ సూయిజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, ట్రీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ స్క్రాప్, స్క్రాప్ ష్రెసింగ్ యూనిట్, మాట్రెస్స్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, సి–డి వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్‌లు ఉన్నాయన్నారు. వీటి గురించి త్రీడీ పద్ధతిలో ప్రత్యక్షంగా విద్యార్థులకు, పిల్లలకు, ప్రజలందరికీ సమాచారాన్ని చూపించడమే ఇన్ఫర్మేషన్ పార్కు ముఖ్య ఉద్దేశమని కమిషనర్ వివరించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఏడీహెచ్ శ్రీనివాసు, డీసీపీ జుబిన్ సిరెన్ రాయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పానీపూరి డబ్బులు కట్టలేదని స్నేహితుడిపై దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తాము తిన్న పానీపూరికి డబ్బులు కట్టమని తమ స్నేహితుడిని బెదిరించడమే కాకుండా అతనిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దావు బుచ్చయ్య కాలనీకి చెందిన గొర్లె తేజ(19) ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం కళాశాలకు వెళ్లి వచ్చిన అతను సాయంత్రం తమ ఇంటి సమీపంలో ఉన్న పానీపూరి తినేందుకు పానీపూరి బండి వద్దకు వెళ్లాడు. అయితే అక్కడికి అదే సమయంలో తేజకు తెలిసిన రాహుల్, అతని స్నేహితుడు ఇద్దరు కూడా పానీపూరి తినడానికి వచ్చారు. మేము తిన్న పానీపూరికి కూడా డబ్బులు కట్టు అంటూ తేజను బెదిరించారు. దానికి తేజ తాను కట్టనని గట్టిగా చెప్పి ముందుకు వెళ్తుండగా రాహుల్, అతని స్నేహితుడు కలిసి తేజను దారిలో అడ్డగించి అతనిపై దాడికి పాల్పడ్డారు. తేజ ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తేజ తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్ప స్వామికి విశేష పూజలు



దుర్గాపురంలో అయ్యప్పస్వామివారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం శ్రీమణికఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గురుస్వామి బల్లెం పూర్ణయ్య స్వామి స్వామివారికి పంచామృతాభిషేకం పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం రెండు వందల మంది స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగింది.

శ్రీదత్తసాయి మందిరంలో..

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బుధవారం కార్తిక మాసోత్సవాల్లో భాగంగా అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాములకు భోజనాలు వడ్డించారు. గత నెల రోజులుగా తాము చేస్తున్న అన్నప్రసాద వితరణకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. 300 మంది స్వాములు స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

ఎస్ఆర్ఆర్‌లో కెమిస్ట్రీ డే వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యాన కెమిస్ట్రీ డే వేడుకలు జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.నారాయణ అతిథి ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన రసాయనశాస్త్రం ప్రాముఖ్యతను వివరించారు. కెమిస్ట్రీ డే పురస్కరించుకుని విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరావు, ప్రసాద్, ఎం.మాల్యాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

డెప్యూటీ డివిజన్ కార్యదర్శిగా సురేష్



డివిజనల్ డెప్యూటీ కార్యదర్శిగా ఎన్నికైన సురేష్‌ను సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్స్ డివిజనల్ డెప్యూటీ కార్యదర్శిగా గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి గద్దా సురేష్ నియమితులయ్యారు. సికింద్రాబాద్‌లో జరిగిన ఎస్‌సీఆర్ఈ సంఘ్ 224వ సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుంటుపల్లి బ్రాంచిలో బుధవారం జరిగిన బ్రాంచి ఎగ్జిక్యూటివ్ సభ్యుల సమావేశంలో గద్దా సురేష్‌ను ఘనంగా సత్కరించారు. తనపై నమ్మకంతో డెప్యూటీ డివిజన్ కార్యదర్శిగా ఎంపిక చేసిన కేంద్ర యూనియన్ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాంచ్ అధ్యక్షుడు శివనాగేశ్వరరావు, వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్‌రాజు, కోశాధికారి విమల్‌సాయి, లాలియానాయక్, శంకర్‌రావు, సుధాకర్ పాల్గొన్నారు.

బీఎల్ఓలు విధులు సక్రమంగా నిర్వర్తించాలి

ప్రత్యేక పరిశీలకుడు శ్రీధర్



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ప్రత్యేక పరిశీలకుడు బి.శ్రీధర్

పెనమలూరు: ఓటర్ల జాబితా విషయంలో బూత్ లెవల్ అధికారులు అప్రమత్తంగా ఉండి విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఓటర్ల జాబితా సవరణ జిల్లా ప్రత్యేక పరిశీలకుడు, ఏపీ కాలుష్య నివారణ మండలి కార్యదర్శి బి.శ్రీధర్ అన్నారు. ఆయన బుధవారం తాడిగడప, పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పెనమలూరు పల్లిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పుల వివరాలను బూత్ లెవల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మరకు బూత్ లెవల్ అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. మృతి చెందిన ఓటర్ల వివరాలతో పాటు డబుల్ ఎంట్రీ ఓటర్లను గుర్తించి తొలగించాలని సూచించారు.18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లకు ఓటు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఓటర్లను గతంలో వారికి ఉన్న ఓటు విషయమై తనిఖీ చేయాలన్నారు. బూత్ లెవల్ అధికారులు నిబంధనల ప్రకారమే పని చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, తహసీల్దార్ కట్టా వెంకట శివయ్య, తాడిగడప కమిషనర్ ప్రకాశరావు, డీటీ భవాని,రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షల శిబిరం

గన్నవరం: స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో ఈ నెల 15వ తేదీన రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మణిపాల్ ఆస్పత్రి వైద్యులతో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళలలో రొమ్ము, గర్భాశయంలో వచ్చే క్యాన్సర్‌కు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రమాణ స్వీకార సభాస్థలం పరిశీలన



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ నూతన పాలకవర్గం ఈనెల 17న ప్రమాణ స్వీకారం చేయనుంది. ఈనేపథ్యంలో బుధవారం ఆలయం వద్ద సభా వేదిక స్థలాన్ని ఎంపీపీ మార్కపూడి గాంధీ, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, నూతనంగా ప్రమాణస్వీకారం చేయబోయే పాలకవర్గ సభ్యులు జంగాల శ్రీనివాసరావు, బెజవాడ శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం అనంతరం సభ, మునేరు అవతల మామిడి తోటల్లో భోజనాలు ఏర్పాట్లు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలోమైనింగ్ కార్పొరేషన్ డైరక్టర్ బత్తుల రామారావు, ఏఎంసీ డైరక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, ట్రేడ్ యూనియన్ నాయకులు దేరంగుల శ్రీనివాసరావు, బీసీ నాయకులు అంగజాల కాశీరాజ్ పాల్గొన్నారు.

పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు



పవిత్ర సంగమం వద్ద పోలిస్వర్గం దీపారాధన చేస్తున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: కార్తికమాసం ముగింపు సందర్భంగా పోలిస్వర్గం పాడ్యమి పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్దకు భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారుజాము నుంచి సంగమం వద్దకు చేరుకుని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. లోకమంతా చల్లగా ఉండాలని ఆకాంక్షించి బ్రాహ్మణులకు దానాలతో నమస్కరించారు. ఒత్తులతో దీపాలు వెలిగించి కృష్ణమ్మకు ఒడిలో విడిచి పెట్టారు. సమీపంలోని శివాలయాల్లో పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. మున్సిపాల్టీ అధికారులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: వివిధ సచివాలయాల సిబ్బంది సహకారంతో విద్యార్థులకు ఇస్తున్న క్షేత్ర స్థాయి శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ కోర్సును అభ్యసిస్తున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మండల పరిధిలోని ఆయా గ్రామ సచివాలయాల్లో బుధవారం సిబ్బంది తాము చేస్తున్న వృత్తిపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ లక్ష్మీకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులు తమ గమ్యం నిర్ణయించుకుని ఆ దిశలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. సరళకుమారి అభ్యర్థన మేరకు ఎంపీడీఓ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని అధ్యాపకులు లక్ష్మీరాజ్యం, రాధాకృష్ణ పర్యవేక్షించారు.

కానూరులో బైక్ చోరీ

పెనమలూరు: కానూరులో బైక్ చోరీ జరగటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన వల్లభనేని వెంకటేష్ బోర్‌వెల్స్ పనులు చేస్తుంటాడు. అతను మంగళవారం కానూరు స్పీడ్ బార్ సమీపంలో బైక్ పార్కు చేసి పని కోసం మాట్లాడటానికి పక్క సందులోకి వెళ్లాడు. అతను కొద్ది సమయం తరువాత వచ్చి చూడగా బైక్ కనపడలేదు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.